క్లుప్తంగా

'చలో సిద్దిపేట' విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: సిద్దిపేట విపంచి కళానిలయంలో ఈ నెల 29న నిర్వహించే తెలంగాణ స్టేట్ కన్స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్, భవన నిర్మాణ కార్మికుల ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ మంచిర్యాల జిల్లా కన్వీనర్ మద్దూరి రాజు యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం మహాసభ పోస్టర్ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ మహాసభకు భవన నిర్మాణరంగ కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ కన్స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్, బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కంది శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఐక్యత సభ

మంచిర్యాలఅర్బన్: పీడీఎస్‌యూ ఐక్యత సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంచిర్యాల మార్క్స్‌భవన్‌లో ఈ నెల 28న ఖమ్మంలో నిర్వహించే రెండు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ)ల ఐక్యత సభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తుందని ఆరోపించారు. ఈ నెల 28న తలపెట్టే పీడీఎస్‌యూ ఐక్యత సభకు విద్యార్థులు, మేధావులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా బాధ్యులు కార్తిక్, తిరుపతి, వైష్ణవి, అంజి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



పాఠశాలలో మొక్క నాటుతూ...

భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలకు మహిళా చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక 'గుడ్‌టచ్–బ్యాడ్‌టచ్' గురించి తెలియజేశారు. ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న సిలిండర్ల పట్టివేత



పట్టుకున్న ట్రాలీతో అధికారులు

జన్నారం: ఎలాంటి క్యాష్ మెమో లేకుండా అక్రమంగా తరలిస్తున్న 62 ఇండియన్ గ్యాస్ సిలిండర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. సిలిండర్లు తరలిస్తున్నారనే సమాచారంతో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో సిలిండర్లను తరలిస్తున్న ట్రాలీని ఆర్ఐ భానుచందర్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీ చేశారు. దండేపల్లి నుంచి 62 సిలిండర్లను తీసుకువస్తున్నట్లు డ్రైవర్ తెలిపాడు. కాగితాలు పరిశీలించగా ఎలాంటి క్యాష్ మెమో చూపకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. వీటిని భరత్‌గ్యాస్ గోడౌన్‌లో భద్రపర్చామన్నారు. ట్రాలీని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ప్రజావాణికి స్పందన కరువు

భీమారం: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిని ప్రజలు వినియోగించుకోవడం లేదని ఎంపీడీవో మధుసూధన్ పేర్కొన్నారు. తహసీల్దార్ సదానందం, అధికారులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు చోరీ అయ్యాయని ఫిర్యాదు

మందమర్రిరూరల్: మండలంలోని చిర్రకుంటలో ఏర్పాటు చేసిన ఐదు హైమాస్ట్ లైట్లలో నాలుగు ఇటీవల చోరీకి గురయ్యాయని గ్రామస్తుడు దుర్గం మల్లేష్ తెలిపారు. వాటిని తీసుకెళ్లిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.

గోదావరి రోడ్డు తొలగింపుపై ఆగ్రహం

- ఐకే–ఓసీపీ లారీలను అడ్డుకున్న స్థానికులు
- గోదావరి నదికి పాత రోడ్డు కొనసాగించాలని డిమాండ్



ఐకే–ఓసీపీ లారీ అడ్డుకుంటున్న రామారావుపేట వాసులు

జైపూర్: మండలంలోని రామారావుపేటకు సమీపంలోని గోదావరి నదికి వెళ్లే రోడ్డును తొలగించడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రే పాత రోడ్డును మూసివేయడం ఏంటని సింగరేణి అధికారులను సోమవారం నిలదీశారు. పంట పొలాలకు, చేన్లకు, గోదావరి నదికి వెళ్లే పాతరోడ్డు అలాగే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు, ప్రజలు ఐకే–ఓసీపీ లారీలను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. జైపూర్ మండలం ఇందారం ఐకే–ఓసీపీ ప్రాజెక్టు వోబీ మట్టి తరలింపులో భాగంగా గోదావరి నది ఒడ్డున శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు డంపులపైకి మట్టి రవాణా చేయడానికి రామారావుపేట శివారు నుంచి రోడ్డు నిర్మించారు. ఈ క్రమంలో రామారావుపేట గ్రామం నుంచి గోదావరి పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలకు, గోదావరి నదికి వెళ్లడానికి గతంలో నిర్మించిన రోడ్డును ఇప్పుడు సింగరేణి అధికారులు తొలగించడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పుడు ఉన్న రోడ్డు అలాగే కొనసాగిస్తూ ఓపెన్‌కాస్టు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే శ్రీరాంపూర్ ఓసీపీ, ఇందారం ఓసీపీ బాంబు బ్లాస్టింగ్ దెబ్బలతో ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని వాపోయారు. ఓసీపీ నుంచి వచ్చే దుమ్ముతో అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. పొలాలకు, చేన్లకు వెళ్లే రోడ్డు మూసివేతను సింగరేణి అధికారులు విరమించుకోవాలన్నారు. మూసివేసిన పాత రోడ్డును వెంటనే ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో పెద్ద మొత్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన చేస్తున్న స్థానిక నాయకులు, రైతులతో మాట్లాడి నచ్చజెప్పారు.

మరో రోడ్డు ఏర్పాటు

జైపూర్: మండలంలోని రామారావుపేట రైతులు పంట పొలాలకు, గోదావ రి నదికి వెళ్లడానికి సురక్షితమైన మరో రోడ్డు ఏర్పాటు చేసినట్లు సింగరేణి అధికారులు పేర్కొన్నారు. గోదావరి నదికి వెళ్లడానికి రెండు డంపీల మధ్యలో ఉన్న దారిలో ఇందారం ఓసీపీ ప్రాజెక్టు వోబీ డంపింగ్ చేయడం అత్యవసరమైందని, ఈ ఓబీ రవాణాలో భారీ యంత్రాలు నడుస్తాయన్నారు. రామారావుపేట ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, యాజమాన్యం సురక్షితమైన మార్గంలో పాత రోడ్డుకు అనుసంధానంగా మరో కొత్త రోడ్డు నిర్మించినట్లుగా పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన రోడ్డు పంట పొలాలకు, గోదావరి నదికి వెళ్లడానికి సులువుగా ఉంటుందన్నారు. వినియోగించుకోవాలని కోరారు.

పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులకు సన్మానం



మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్యను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలోని మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట మున్సిపాలిటీల్లో పదవులు నిర్వర్తించి, ఇటీవల పదవీకాలం ముగిసిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ వార్డు కౌన్సిలర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తన నివాసంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, లక్సెట్టిపేట మాజీ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, అత్తి సరోజ పాల్గొన్నారు. **లక్సెట్టిపేట:** మున్సిపల్ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశామని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు అభినందన సమావేశంలో మాట్లాడారు. నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు చేసి చాలా అభివృద్ధి పనులు చేపించామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

'గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం'

జన్నారం: గ్రామాలను అభివృద్ధి చేయడం, మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో రూ.20లక్షలతో మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు సోమవారం జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్‌తో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, అంగన్‌వాడీ సీడీపీవో రేష్మా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో ముగిసిన క్రికెట్ పోటీలు

చెన్నూర్: పట్టణంలోని జెండావాడ మైదానంలో నిర్వహించిన ప్రైమరీ లీగ్ దిల్, నోషత్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. శివాజీ మహారాజ్ టీమ్ విజేతగా నిలువగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్న నారాయణ, మాజీ కౌన్సిలర్ అనీల్ నగదు, మెమెంటో అందజేశారు.

తాండూర్‌లో ప్రారంభం...

తాండూర్: మండల స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దివంగత కేంద్ర మాజీమంత్రి గడ్డం వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ పోటీలను టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, తాండూర్ సీఐ కుమారస్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై క్రికెట్ పోటీలు ప్రారంభించారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

పాతమంచిర్యాల/మందమర్రిరూరల్: జిల్లా కేంద్రంలో మంచిర్యాల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో, మందమర్రిలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఎలక్ట్రీషియన్స్ డే ఘనంగా జరుపుకున్నారు. థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సీపీఎస్ రద్దు చేయాలని వినతి

దండేపల్లి/లక్సెట్టిపేట: 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలవుతున్న సీపీఎస్‌ను రద్దుచేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలని పీఆర్టీయూ టీఎస్ డిమాండ్ చేసింది. లక్సెట్టిపేటలో తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు, దండేపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ విజయకు ఆయా మండలాలకు చెందిన పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం వినతిపత్రాలు అందించారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్/తాండూర్: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా మందమర్రి, రామకృష్ణాపూర్, తాండూర్ మండలాల్లో రోడ్డు భద్రతపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. రోడ్డు పైకి వచ్చే ప్రతి వాహనానికి సరైన ధృవీకరణ పత్రాలు ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపొద్దన్నారు. ఆటోల్లో మితిమీరి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లొద్దన్నారు. నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని, హెల్మెట్ ధరించి టూవీలర్స్ నడపాలని కళాకారులు కళాజాత నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, సారధి కళాకారుల టీం లీడర్ ముల్కల మురళి, తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో అన్నదాతల ఇబ్బందులు



మాట్లాడుతున్న రాంరెడ్డి, నాయకులు

చెన్నూర్: సీసీఐ, మార్కెట్ కమిటీ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని కోటపల్లి మాజీ జెడ్పీటీసీ పోటు రాంరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ ప్రాంతంలో గల జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఏర్పాటు చేసిన పత్తి కొనుగోళ్లు ఎప్పుడు బంద్ చేస్తారో... ఎప్పుడు ప్రారంభిస్తారో... రైతులకు తెలియని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కౌలు రైతులకు సంబంధించి జిల్లా అధికారులు, ఏఈవో ధృవీకరించిన సర్టిఫికెట్ ఆధారంగానే పత్తి కొనుగోళ్లు చేయాలన్నారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల్లో పత్తి పంటను నెల రోజుల వెనక సాగు చేశారని, దిగుబడి సైతం నెల రోజులు ఆలస్యంగానే వస్తుందన్నారు. దిగుబడి ఆలస్యంగా వచ్చిన నాణ్యమైన పత్తిని సెకండ్ క్వాలిటీ అంటూ సీసీఐ అధికారులు రూ.వంద కోత వేస్తున్నారని పేర్కొన్నారు. సీసీఐ అధికారులు ఇప్పటికైనా రైతులు తీసుకొచ్చిన పత్తిని నాణ్యత ప్రమాణాలను కొలిచి ప్రభుత్వం ప్రకటించిన పూర్తి మద్దతు ధర చెల్లించాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పోచం, తాళ్ల బాపు, మల్లయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏసీపీకి దళితుల ఆత్మీయ సన్మానం

బెల్లంపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కుమార్‌దీపక్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్న బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసు అధికారి ఏ.రవికుమార్‌ను సోమవారం తెలంగాణ దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు సన్మానించారు. మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కుంబాల రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శివ పార్వతుల కల్యాణం



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని అర్చకులు వేణుగోపాల్, సతీష్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి శ్రీరాములు ఆధ్వర్యంలో వేడుకలు జరిపించగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహిళా భక్తులు పార్వతి అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

కోదండ రామాలయంలో చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక గౌతమినగర్ కోదండ రామాలయంలో మూల నక్షత్రంను పురస్కరించుకొని సోమవారం 13వ చండీహోమం నిర్వహించారు. చండీహోమం కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ముగిసిన ఉర్సు



దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ సతీష్‌కుమార్

చెన్నూర్: పట్టణంలోని జమా మసీద్ వెనకాల దర్గా వద్ద శని, ఆదివారాలు రెండు రోజుల పాటు నిర్వహించిన సయ్యద్ బాబా ఉర్సు సోమవారం ముగిసింది. ముగింపులో భాగంగా మాజీ ఎమ్మెల్సీ సతీష్‌కుమార్, ఉర్సు ఉత్సవ కమిటీ అధ్యక్షులు నవాజ్ ఆధ్వర్యంలో దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యులు ఖమ్రుద్దీన్, అఖిల్, యాసిన్ ఉన్నారు.

30న డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో ఈ నెల 30న అప్‌గ్రేడ్ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల టాస్క్ కో–ఆర్డినేటర్ హరీష్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు, ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2024లో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 34మంది సెలక్టు అయినట్లు పేర్కొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే హక్కులు సాధించాం

- టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్
- ఘనంగా యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లక్ష్మణ్

శ్రీరాంపూర్: సింగరేణి చరిత్రలో కార్మికులకు నిలిచిపోయే హక్కులు సాధించామని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ తెలిపారు. ఆ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నస్పూర్‌కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. యూనియన్ ఏర్పాటుకు కృషి చేసిన దివంగత ప్రొఫెసర్ జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు బుడ్డి ప్రసాద్, ఉత్తేజ్‌రెడ్డి, తొంగల రమేష్, మహిపాల్‌రెడ్డి, జగదీశ్, వెంకట్‌రెడ్డి, రాజునాయక్, ఉప్పల సంపత్‌లు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ సెక్యూరిటీ ఫిట్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నాయకులతో జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఐఎన్టీయూసీ ఎస్అండ్‌పీసీ డిపార్టుమెంట్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుల ఫిట్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కాంట్రాక్ట్ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీం రవి హాజరయ్యారు. నూతన ఫిట్ కమిటీ అధ్యక్షుడిగా సిరిపురం రాజేష్, ఉపాధ్యక్షులుగా దాడి రాజేష్, భరత్‌కుమార్, అజ్మీర పున్నం నాయక్, ఆడెపు అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఆవుల రమేష్, సంయుక్త ప్రధాన కార్యదర్శిగా పెద్ది ఓదెలు, బొడ్డుల నరేష్, సహాయ కార్యదర్శిగా ఆసంపల్లి కుమారస్వామి, అబ్బ గాని సంపత్ కుమార్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాందేని శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎం రజిని కుమార్, పొన్నం కుమార్ స్వామి, లక్కపురం రవి, నూనె శ్రీకాంత్, నస్పూర్ బాబు, ఈ రవీందర్‌రావు, కోశాధికారిగా మైదం రవి ఎన్నికయ్యారు.

వర్క్‌షాప్ డీజీఎంకు సన్మానం



డీజీఎంను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్తమ అధికారిగా ఎంపికై గణతంత్ర వేడుకల్లో సన్మానం పొందిన వర్క్‌షాప్ డీజీఎం రవీందర్‌ను సోమవారం అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. ముమ్ముందు విధి నిర్వహణలో రాణించి ప్రశంసలు పొందాలన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ ఉద్యోగులు రవి, మహేశ్, రమేశ్, బ్రహ్మాచారి, మోహన్, సతీశ్, సాబీర్, పురుషోత్తం, బుచ్చయ్య పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

4న హెల్త్ క్యాంపు

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కంపెనీ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వ్యాధులపై పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓసీపీలో సమస్యలు పరిష్కరించాలి



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా సోమవారం కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఓసీపీ, సీహెచ్‌పీని వేరుగా చూడాలని అప్పుడే ఇన్సెంటివ్‌లో కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్మికులకు సరిపడా ప్లేడేలు మంజూరు చేయాలని, ఓసీపీలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్స్ సూపర్వైజర్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. సమస్యలు పరిష్కరించాలని మేనేజర్‌ను కలిసి చర్చించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఫిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, బ్రాంచ్ నాయకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

వాగుపై వంతెన లేక ఇబ్బందులు



భీమారం: మండలంలోని ఆరెపల్లి క్రాస్ రోడ్డు నుంచి ఎలకేశ్వరం వరకు గల ప్రధాన రహదారిపై గల మంచినీళ్ల వాగుపై వంతెన లేక రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పాలకులకు ఏళ్ల నుంచి వినతిపత్రాలు ఇచ్చినా ఇప్పటివరకు వంతెనకి మోక్షం రావడం లేదని వారు ఆరోపించారు. వర్షాకాలంలో వాగు ఉప్పొంగితే రాకపోకలకు చాలా కష్టాలు పడుతున్నామని వాపోయారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి - మధుసూధన్, ఎంపీడీవో | ఫోన్ నంబర్ : 94400 21333

భూమిపూజ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట 62ఎంబీఆర్ సబ్‌స్టేషన్ ఆవరణలో మరో 31ఎంబీఆర్ ట్రాన్స్‌ఫార్మర్ యార్డు ఏర్పాటు చేసేందుకు సోమవారం ట్రాన్స్‌కో అధికారులు భూమిపూజ నిర్వహించారు. ఎస్ఈ గంగాధర్, డీఈ ఎంఎం ఖైసర్, డీఈ రాజన్న పాల్గొన్నారు.